క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 45, బెండ 23, పచ్చిమిర్చి 35, కాకర 23, బీర 18, క్యాబేజీ 15, ఫ్రెంచిబీన్స్ 80, క్యారెట్ 28, దొండ 23, చిక్కుడు 65, గోకర 25, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలు 21, దోస 13, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 38 ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వైశ్య గర్జనను విజయవంతం చేయండి

లింగోజిగూడ: వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 1న నిర్వహించే వైశ్య గర్జనను విజయవంతం చేయాలని తెలంగాణ ఆటోడ్రైవర్స్ పర్యవేక్షణ సమితి, ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ కార్మిక విభాగం చైర్మన్ ఉప్పల శ్రావణ్ కుమార్ గుప్తా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సరూర్‌నగర్ స్టేడియంలో చేపట్టనున్న వైశ్య గర్జనకు వైశ్యులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు. ఈడబ్ల్యూఎస్ వర్గీకరణతో పాటు పేద విద్యార్థులకు తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.జనాభా తమాషా ప్రకారం అన్ని పార్టీలు వైశ్యులకు టికెట్‌లను కేటాయించాలని శ్రావణ్ కుమార్ గుప్తా కోరారు.

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి

దిల్‌సుఖ్‌నగర్: కాలనీల్లోని సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులతో కలిసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. స్పందించిన కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీల నాయకులు,స్థానిక బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలి


ఫ్రెషర్స్ డే వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

హస్తినాపురం: విద్యార్థులు భవిష్యత్ లక్ష్యం పెట్టుకొని దాని సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని రేస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి.ఎస్. గిరిధర్ అన్నారు. శనివారం హస్తినాపురంలో రేస్ మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను 'ఫ్రెషోరమా- 2023' పేరిట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ సీఈఓ ఎంవీ రమణ, కళాశాల డైరెక్టర్ హరిణిగిరిధర్, ప్రిన్సిపల్ నిహారిక, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బండ్లగూడలో 'డబుల్' లబ్ధిదారుల జాతర

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ మండల కార్యాలయం వద్ద డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులతో శనివారం జాతరను తలపించింది. లక్కీడ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు ఫోన్ చేసి అవసరమైన పత్రాలు తీసుకురావాలని సమాచారం ఇవ్వడంతో ఉదయం 10 గంటల నుంచి బారులు తీరారు. ఆధార్ కార్డులు, ఫొటోలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకొని అధికారులకు అందజేసి టోకెన్ నంబర్లను పొందారు. ఆయా టోకన్ల ఆధారంగా పట్టాల నంబర్లను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఫోన్లు రాని వారు చాలా మంది గోడకు అంటించిన జాబితాలో తమ పేర్లను వెతుకుతూ కనిపించారు. అర్హత పొందిన మరికొందరు తమ పేర్లను లక్కీడ్రాలో వెళ్లాయా..? లేవా..? అంటూ రెవెన్యూ సిబ్బంది వద్ద ఫోన్ లాగిన్లై వివరాలు తెలుసుకున్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధికి వచ్చే ఈ మండలంలో ఇప్పటి వరకు 1845 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారు. ఇందులో ఎస్సీ, ఎస్టీలు 300లుగా ఉన్నారు. ఇదిలా ఉండగా జాబితాలో పేర్లు లేని దరఖాస్తుదారులు నిరాశతో వెనుదిరిగారు.


ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు బారులు తీరిన లబ్ధిదారులు

మలక్‌పేట సమగ్రాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే అహ్మద్ బలాల


ఎల్ఐసీ కాలనీవాసులతో సమావేశమైన ఎమ్మెల్యే బలాల

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం సైదాబాద్ డివిజన్ ఎల్ఐసీ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీవాసులు కోరిన విధంగా ఇక్కడి మహిళాభవన్ విస్తరించేలా మొదటి అంతస్తు నిర్మాణం చేయిస్తామన్నారు. కాలనీకి ఆనుకొని ఉన్న ఓపెన్ డ్రెయిన్ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇక్కడి ప్రభుత్వ క్వార్టర్స్‌లో పలు రకాల మరమ్మతులు చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న మరే ఇతర సమస్యలనైనా తనకు లిఖిత పూర్వకంగా తెలియజేస్తే వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చిస్తానని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో ఎల్ఐసీ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు వీఎస్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డి.రాఘవేంద్రరావు, ఉపాధ్యక్షుడు ఎంఏ హమీద్, కోశాధికారి భద్ర, సంయుక్త కార్యదర్శి టి.కార్తీక్, సభ్యులు కె.రవికుమార్, జి.రాంప్రసాద్, ఐ.సుమన్‌చక్రవర్తి, వి.పవన్ పాల్గొన్నారు.

త్వరలో ఆటోనగర్ ఇసుకలారీ అడ్డా తరలింపు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఇసుక లారీల అడ్డా వల్ల ఆటోనగర్ పరిసర ప్రాంత కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అతి త్వరలోనే ఈ ఇసుక లారీల అడ్డాను వేరే చోటకు తరలిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆటోనగర్ ఇసుకలారీల అడ్డా తొలగింపునకు సంబంధించి టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత 15 ఏళ్లుగా ఇసుకలారీల అడ్డా వల్ల 15 కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి వేళల్లో మహిళలు, వృద్ధులు అటువైపు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటోనగర్ లోపల ఉన్న 11 ఎకరాల స్థలంలో లారీలు పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని సుధీర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆటో లారీల అడ్డా కోసం తాను 11 ఎకరాల స్థలం కేటాయించాలని టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డిని కోరగా అంగీకరించారని తెలిపారు. త్వరలోనే ఆటోనగర్ లారీల అడ్డాను తొలగించి ప్రజలు ఇబ్బందులను తొలగిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో రోడ్డుమీద ఇసుక లారీలు ఆగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నూతనంగా కేటాయించే స్థలంలో వారికి కనీస సౌకర్యాలైన తాగునీరుతో పాటు మూత్రశాలలు, పడుకోవడానికి వసతి కల్పించాలని ఎండీని కోరామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, శ్రావన్, లక్ష్మన్‌రెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, సుధాకర్ , ప్రవీన్‌గౌడ్, సత్తిరెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శౌర్య జాగరణ యాత్రలను విజయవంతం చేయాలి


సమావేశంలో యాత్ర వివరాలు వెల్లడిస్తున్న గుడాల రవీజీ

సైదాబాద్: యువతలో శౌర్యాన్ని ప్రజ్వలింప చేసి వారిని ఉత్తేజితులను చేయాలనే సంకల్పంతో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న శౌర్య జాగరణ యాత్రలను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ వివేకానంద జిల్లా ఉపాధ్యక్షుడు గుడాల రవీజీ కోరారు. శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ కృష్ణానగర్‌లోని కారుణ్య సింధు ఆశ్రమంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులతో కలిసి యాత్ర వివరాలు వెల్లడించారు. యువతలో దైవ భక్తి, దేశభక్తి నింపి, దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చే బాధ్యత యువతపై ఉంచేలా నిర్వహిస్తున్న శౌర్య యాత్రలు అక్టోబర్ 2న బీఎన్‌రెడ్డి నగర్‌లో, అక్టోబర్ 8న సరూర్‌నగర్ చెరువు కట్టపై నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు కె.రాజేందర్‌రెడ్డి, మహేష్ యాదవ్, వెంకన్న, శ్రీనివాస్, రాజేందర్, సాయిప్రసాద్, పురుషోత్తంరెడ్డి, మదనమోహనాచార్యులు, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

దళితులు అన్ని రంగాల్లో రాణించాలి


పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

చాదర్‌ఘాట్: దళితులు అన్ని రంగాల్లో రాణించాలని మలక్‌పేట దళిత సేవా సంఘం అధ్యక్షుడు బాబు శ్రీనివాస్ అన్నారు. శనివారం ఓల్డ్‌మలక్‌పేట అంబేడ్కర్ లైబ్రరీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. అంబర్‌పేట మండల కార్యాలయ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను అర్హులైన దళితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళితులకు సంబంధించిన పలు పథకాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు, చాదర్‌ఘాట్ ఎస్ఐ భరత్, నాయకులు మహేందర్, సంపత్, నవీన్, శంకర్, పద్మావతి, రమాదేవి మహ్మద్‌గౌస్, నాగరాజు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్షుడిగా రవి


రవి ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నల్లా రఘుమారెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగ అధ్యక్షుడిగా చంపాపేటకు చెందిన రవి ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నియామక ఉత్తర్వులను శనివారం చంపాపేటలో జరిగిన సమావేశంలో అందజేశారు. ఈ సందర్భంగా రవి ముదిరాజ్ మాట్లాడుతూ, రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనను బాధ్యతాయుతమైన పదవిలో నియమించినందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి, కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, నాయకుడు ముద్దా కల్యాణ్‌చక్రవర్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుంకోజు కృష్ణమాచారి, ఓరుగంటి వెంకటేష్‌గౌడ్, ముడుపు రాజిరెడ్డి, ఉమామహేశ్వర్, గోగిరెడ్డి అంజిరెడ్డి, జంగయ్య, చీర శ్రీనివాస్, సత్యప్రకాష్, కనకేష్ పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ

● మీర్‌పేటలో 'మేరా దేశ్ మేరా మిట్టి'


మట్టిని స్వీకరిస్తున్న మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: ఇంటింటికీ బీజేపీ నాయకులు వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మీర్‌పేట కార్పొరేషన్‌లో శనివారం కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ 'మేరా దేశ్ మేరా మిట్టి' నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి ఇంటింటికి తిరిగి మట్టిని స్వీకరించారు. దేశ రక్షణకు అమరులైన సైనికుల జ్ఞాపకార్థం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం స్తూపం ఏర్పాటు చేస్తోందని, అందులో భాగంగానే మేరాదేశ్ మేరా మిట్టి నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు పెండ్యాల శివపార్వతి, భిక్షపతిచారి, యాదగిరి యాదవ్, సూల ప్రభాకర్, గాజుల మధు, మద్ది రాజశేఖర్‌రెడ్డి, బెల్లంకొండ నాగరాజు, నగేష్‌కుమార్, విక్కీసాగర్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం: సామ


సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం కోసం ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసిందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. శనివారం ఎల్‌బీనగర్‌లోని బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మార్చి 2023 వరకు జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్లకు 600 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని, మార్చి నుంచి నేటికి మరో 400 కోట్ల బకాయిలు పెరిగి మొత్తం వెయ్యి కోట్లకు చేరిందని అన్నారు. కమీషన్ల కోసం పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారని, చిన్నచిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు కాంట్రాక్టర్లతో బకాయి సొమ్మును నెలకు 30 కోట్ల చొప్పున చెల్లిస్తామని చెబుతున్నారని, దీనిని నిరసిస్తూ అక్టోబర్ మొదటి తేదీ నుంచి కాంట్రాక్టర్లు సమ్మె బాట పట్టబోతున్నారని అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాత్రం ఎన్నికలు సమీపిస్తున్నాయని అభివృద్ధి పేరుతో వందల కోట్లతో నూతన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారని ఆరోపించారు.

కత్తితో దాడిచేసిన నిందితుడి రిమాండ్

కాచిగూడ: తాగిన మైకంలో ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా ప్రాంతానికి చెందిన గంగా బెహరా కుమారుడు రిపూ బెహరా (28) వృత్తిరీత్యా కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలోని వుడ్‌సైడ్ హోటల్‌లో పార్సల్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో పింటూ, నిఖిల్ మెడపై కత్తితో దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుభాష్ తెలిపారు.

కృష్ణా, కాచిగూడ రైల్వేస్టేషన్ల మధ్య తొలి రైలు సర్వీస్

కాచిగూడ: కృష్ణా (మహబూబ్‌నగర్) – కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య మొట్ట మొదటి రైలు సర్వీస్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం జెండా ఊపి ప్రారంభించనున్నారని రైల్వే అధికారులు ప్రకటించారు. కాచిగూడ – రాయచూర్ – కాచిగూడ స్టేషన్ల మధ్య దేవరకద్ర –కృష్ణా మీదుగా నూతన రైలు సర్వీస్ (డెమూ) ప్రవేశపెట్టినట్లు తెలిపారు. క్రిష్ణా నుండి కాచిగూడ రైలును ప్రధాని ప్రారంభించనున్నారని, ఈ రైలు కృష్ణా నుంచి కాచిగూడ వరకు నడుస్తుంది. దీంతో కాచిగూడ, రాయచూర్ మధ్య రోజువారీ రైలు సేవలు హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, రాయచూర్ జిల్లాలను కలుపుతూ రైలు నడుస్తుందన్నారు. ఈ రైలు మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని ప్రజలకు రాజధాని వైపు సౌకర్యవంతమైన రవాణా సౌకర్యాన్ని అందిస్తుందన్నారు. నారాయణపేటలోని చేనేత పరిశ్రమకు ఎంతగానో ఊతమిస్తుందన్నారు.

ప్రధాని పర్యటనను అడ్డుకుంటాం

కాచిగూడ: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేపట్టకుండా ప్రధాని నరేంద్రమోదీ మాదిగలను మోసగించారని తెలంగాణ మాదిగ హక్కుల దండోర వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజ్ మాదిగ, తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు ఇటికె రాజు మాదిగ ఆరోపించారు. ఆదివారం ప్రధాని పర్యటనను అడ్డుకుంటామని వారు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని బహిరంగ సభను మాదిగలు బహిష్కరించాలని వారు పిలుపునిచ్చారు.

4న గుర్రం జాషువా జయంతి వేడుకలు

కాచిగూడ: సమతా సాహితి వేదిక ఆధ్వర్యంలో అక్టోబర్ 4న సాయంత్రం తెలుగు విశ్వవిద్యాలయంలో మహాకవి, నవయుగ కవి చక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సమతా సాహితి వేదిక అధ్యక్షురాలు కాకుమాను శశిశ్రీ ప్రకటించారు. రాష్ట్ర ఏసీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చేతన ముఖ్య అతిథిగా, ప్రముఖ కవులు ఆచార్య శిఖామణి, డాక్టర్ కోయ కోటేశ్వరరావు, డాక్టర్ పసునూరి రవీందర్, ప్రముఖ న్యాయవాది శ్రీకాంత్ చింతల, మానవ హక్కుల కార్యకర్త విశ్వనాథ్, జయంతి తదితరులు పాల్గొంటారన్నారు.

రూ.8.69 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

యాకుత్‌పురా: యాకుత్‌పురా నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అభివృద్ధి పనులను చేపట్టనున్నామని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. రెయిన్‌బజార్ డివిజన్‌లో రూ.8.69 కోట్ల అభివృద్ధి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఆయన యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మురికి నాలా, సివరేజ్, డ్రైనేజీ, వర్షపు నీటి, సీసీ, బీటీ నాలా విస్తరణ అభివృద్ధి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టనున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న మరో రూ.70 లక్షల అభివృద్ధి పనులు సైతం త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ప్రతిపాదించిన మెట్రో రైలు నిర్మాణ పనులు ఇప్పటికే సంబంధిత అధికారులు సర్వే చేపట్టారన్నారు. గుల్జార్ హౌస్ వాటర్ ఫౌంటెన్ పునర్నిర్మాణ పనులు పూర్తి కాగానే మంత్రి కేటీఆర్‌తో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎల్, ప్రాజెక్టు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి

జలమండలి డీజీఎంను కోరిన కార్పొరేటర్ పవన్‌కుమార్


కొత్తపేటలో కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట గ్రామంలో తాగునీటిలో డ్రైనేజీ నీరు కలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ జలమండలి అధికారులను కోరారు. శనివారం కొత్తపేట గ్రామంలో తాగునీటిలో డ్రైనేజీ నీరు కలుస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు కార్పొరేటర్ పవన్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన అక్కడికి వెళ్లి కాలనీ పెద్దలతో కలిసి సమస్యను పరిశీలించారు, అనంతరం జలమండలి డీజీఎం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. కాలనీలో ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ ఒక్కొక్కటిగా పాడైపోతున్నాయని, దీంతో తాగునీటిలో డ్రైనేజీ నీళ్లు కలిసి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. తక్షణమే కొత్తపేట గ్రామంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని డీజీఎం కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు మున్ను స్వామి యాదవ్, ప్రకాష్ యాదవ్, అశోక్ యాదవ్, గోపి యాదవ్, గట్టు మహేష్, సంపత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దుతాం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్‌లో అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆమె రాజరాజేశ్వరి ఆలయ వీధిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దీర్ఘ కాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మౌలిక సదుపాయాలు మరింతగా మెరుగుపరుస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, సందీప్, కిరణ్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

మెట్రోరైల్ సాధనకు పోరాటాలు ఉధృతం చేస్తాం


మాట్లాడుతున్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: పాతబస్తీలో వెంటనే మెట్రోరైల్ పనులు ప్రారంభించాలని లేని పక్షంలో మెట్రోరైల్ సాధనకు పోరాటాలు ఉధృతం చేస్తామని పాతనగర మెట్రోరైల్ జేఏసీ నేతలు హెచ్చరించారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జేఏసీ నేతలు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ.నర్సింహ, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, టీపీసీసీ కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఉస్మాన్‌బిన్ మొహమ్మద్ అల్ హాజరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్, టీటీడీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవీంద్రచారి మాట్లాడారు. పాతనగరంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెట్రోరైల్ పనులు ప్రారంభించకపోతే అక్టోబర్ మొదటి వారంలో ప్రతిపాదిత ఫలక్‌నుమా మెట్రో రైల్ డిపో వద్ద వేలాది మందితో భారీ ధర్నా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.ఓల్డ్‌సిటీ మెట్రో కనెక్టివిటీ విస్తరణను తక్షణమే ప్రారంభిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడం, రూ.500 కోట్లు కేటాయించడం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటివరకు ఎందుకు పనులు ప్రారంభించలేదన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రోరైల్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మలక్‌పేట్‌లో మెట్రో వచ్చిందని, అది పాతబస్తీ అని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో సయ్యద్ సలీం, ముసా ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

మిలాద్–ఉన్–నబీని ప్రశాంతంగా జరుపుకోవాలి


మత పెద్దలతో సమావేశమైన ఏసీపీ

చాంద్రాయణగుట్ట: మిలాద్–ఉన్–నబీ పండగ ర్యాలీలను ప్రశాంతంగా జరుపుకోవాలని చాంద్రాయణగుట్ట డివిజన్ ఏసీపీ మనోజ్‌కుమార్ సూచించారు. ఆదివారం జరగబోయే ర్యాలీలను పురస్కరించుకొని శనివారం రాత్రి ఆయన డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనం రోజునే మిలాద్–ఉన్–నబీ ఉన్న నేపథ్యంలో తమ విజ్ఞప్తి మేరకు 1న ఊరేగింపులను వాయిదా వేసుకోవడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా యువత బైక్‌లపై విన్యాసాలు చేయకుండా పెద్దలు సముదాయించాలన్నారు. డివిజన్ పరిధిలోని పూల్‌బాగ్, హఫీజ్‌బాబానగర్‌ల మీదుగా బాలాపూర్ దర్గా వరకు కొనసాగే ఊరేగింపునకు గట్టి బందోబస్తును ఏర్పా టు చేస్తున్నామన్నారు. చాంద్రాయణగుట్ట, బండ్లగూడ, కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు గురునాథ్, మహ్మద్ షాకీర్ అలీ, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

టెన్నిస్ ఓపెన్ టోర్నమెంట్ ప్రారంభం


హైదరాబాద్ ఓపెన్‌టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

గచ్చిబౌలి: హైదరాబాద్ ఓపెన్ టోర్నమెంట్‌ను సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ప్రారంభించారు. శనివారం మాదాపూర్‌లోని ఎస్‌వీకె టెన్నిస్ అకాడమీలో 14వ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌ను టెన్నిస్ ఆడి ఆయన ప్రారంభించారు. పురుషుల సింగిల్స్, డబుల్స్ ఈవెంట్లలో 30,40,50,60,70 వయో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుండగా, మహిళలు ఓపెన్ విభాగంలో పోటీ పడనున్నారు.దేశ వ్యాప్తంగా 451 మంది క్రీడాకారులు పాల్గొంటారని, అక్టోబర్ 2న ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ నంద్యాల నర్సింహా రెడ్డి తెలిపారు. క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేసినట్లు వివరించారు. సింగిల్స్ విభాగంలో 303 మంది, డబుల్స్‌లో 149 మంది బరిలోకి దిగుతున్నారని పేర్కొన్నారు. విజేతలకు ఐదు లక్షల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ డీసీపీ ప్రదీప్, పీవీ రావు, హరి కృష్ణారెడ్డి, ఏఆర్‌రావు, సదాశివారెడ్డి, లగ్గాని శ్రీనివాస్, అనురుధ్, జెవి రమణ తదితరులు పాల్గొన్నారు.